క్లుప్తంగా

ఫార్మేటివ్ పరీక్షల పరిశీలన



పరీక్షను పరిశీలిస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: నగరంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో మంగళవారం ఫార్మేటివ్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక గాంధీపురం – 2 నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు, నియమావళిని అనుసరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులకు ప్రిన్సిపల్స్ ఆఫ్ వాల్యుయేషన్ తయారు చేసి మార్కులు గ్రేడింగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన ప్రాజెక్టు వర్క్ మార్కులను, అంతర్గత మార్కులు జత చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఆర్.సన్యాసిరావు ఉన్నారు.

యోగా పోటీలకు కొంతమూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రత్నకళ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ యోగా పోటీలకు కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు బి.రత్నకళ తెలిపారు. ఎం.ఆనంద్, ఎస్‌కే అజీస్, బి.శ్రీనివాసు, డి.శ్రావ్యదుర్గ జిల్లా స్థాయి యోగా పోటీలలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ టి.సుజాతను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెస్సీ విద్యార్థులకు సైన్స్ తరగతులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలోని ఎమ్మెస్సీ విద్యార్థులకు సైన్స్ అంశాల్లో శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. దీనిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకూ ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భౌతికశాస్త్ర విద్యార్థులకు, బీఎస్సీ తృతీయ సంవత్సరం రెన్యువబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. మొత్తం 50 మందికి త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ, ప్రొటోటైప్ డిజైనింగ్, ఆర్డినో, సౌరశక్తి విషయాలపై వారం రోజులు శిక్షణ జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రోసోల్ మైండ్స్ సహకారంతో ఈ కోర్సులను విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ప్రోసోల్ మైండ్స్ సీనియర్ మెంటార్ షేక్ కరీముల్లా మాట్లాడుతూ ఈ కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి కె.కోమల లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి, కార్యశాల కార్యదర్శి రెడ్డి, లెఫ్టినెంట్ ఈసుల్ బాషా షేక్ పాల్గొన్నారు.

నర్సరీ రైతు శ్రీనివాస్‌కు సత్కారం



గొల్లపల్లి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మల్లు పోలరాజు, సభ్యులు

కడియం: మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ నర్సరీ రైతు గొల్లపల్లి శ్రీనివాస్ సేవలు అభినందనీయమని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు అన్నారు. ఇటీవల మోస్ట్ ప్రెస్టీజియస్ నర్సరీ అవార్డును శ్రీనివాస్ అందుకున్న సందర్భంగా మంగళవారం ఆయన్ను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రతిష్ఠాత్మక టైమ్స్ బిజినెస్ సంస్థ ద్వారా ఈ అవార్డును అందుకోవడం నర్సరీ రంగం ఖ్యాతిని మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ పాలక వర్గ సభ్యులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

విలువల పునర్నిర్మాణం పుస్తకావిష్కరణ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం విలువల పునర్నిర్మాణం పుస్తకావిష్కరణ జరిగింది. దీనికి కళాశాల ఆర్జేడీ చప్పిడి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరరావు హాజరయ్యారు. రామచంద్రరావు మాట్లాడుతూ విలువలు మానవ సమాజ ప్రగతికి సోపానాలన్నారు. పరిశోధనల భాండాగారంగా కళాశాలను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా పయనిస్తామన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు శ్రీశైలశాస్త్రి, ప్రముఖ సాహిత్య వేత్త, సీనియర్ అధ్యాపకులు నూజిళ్ల శ్రీనివాస్, పుస్తక రచయిత, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పోలుమాటి అన్నవరం సత్యనారాయణను ప్రశంసించారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతులు డాక్టర్ యం.సుధామయి, కళాశాల సహాధిపతి జి.చంద్రశేఖర్, తెలుగు అధ్యాపకులు షేక్ జరీనా, సముద్రాల, ప్రిస్కిల్ల, కోడె సౌందర్యవతి పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

- ఎంపీ భరత్ రామ్
- బృహన్నలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సురక్ష వైద్యశిబిరం



కొంతమూరు శిబిరంలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్



కొంతమూరులో మందుల కిట్‌ను అందజేస్తున్న ఆకుల వీర్రాజు



40వ డివిజన్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, చిత్రంలో ఎంపీ భరత్

కంబాలచెరువు: రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 40వ డివిజన్‌లోని బృహన్నలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వారిని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పరీక్షించి, తగిన ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేషమైన స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, 40వ వార్డు ఇన్‌చార్జి దుంగా మంగాలక్ష్మి, 38వ వార్డు ఇన్‌చార్జి అరిగెల బాబు, సుంకర అంజి, సాయిబాబా, దుంగా కుమార్, అప్పాజీ దమ్ము, కృష్ణ వేణి, కనకదుర్గ పాల్గొన్నారు. అనంతరం రాజమండ్రి పేపర్ మిల్లు జంక్షన్ వద్ద చేపట్టిన ఫౌంటైన్ నిర్మాణ పనులను ఎంపీ భరత్ పరిశీలించారు.

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమన్నారు. కొంతమూరు ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైద్యపరీక్షలతో పాటుగా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన చికిత్స, మందులు అందిస్తామన్నారు. కంటి వైద్యసేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం రోగులకు మందులతో కూడి కిట్ బ్యాగులను అందజేశారు.

పేదలకు ఒక వరం: ఆకుల వీర్రాజు

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో కార్పొరేట్ వైద్యాన్ని ప్రజల ఇంటి ముంగిటకు సీఎం జగన్ తీసుకువెళ్లారన్నారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఒకవరమన్నారు. కొంతమూరు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.

504 మందికి వైద్యసేవలు

శిబిరంలో 540 మందికి వైద్యసేవలు అందించినట్లు ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్ తెలిపారు. రోగులకు రక్తపరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశామన్నారు. ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ ఉమా శంకర్, ఆప్తాల్మిజిస్ట్ డాక్టర్ షేక్ రేష్మా, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యులు లిడియా సుచిత, కాతేరు పీహెచ్‌సీ వైద్యులు కె.నాగదేవి,డా.జగదీష్ కృష్ణ వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై సూపర్ వైజర్ మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.చిన్నారావు, ఈవోపీఆర్అండ్ఆర్డీ తాడి కృష్ణ, ఎంఈవో 2 చందుకుమార్, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమ శంకరం, మాజీ ఉపసర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యుడు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

దుళ్లలో 539 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 539 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో స్కూలు విద్యార్థులు 33 మంది, అంగన్‌వాడీ చిన్నారులు ఇద్దరు, 8 మంది గర్భిణులు ఉన్నారు. 130 మందికి కళ్ల పరీక్షలు చేసి, వారిలో 11 మందికి కళ్లజోళ్లు అందజేశారు. జనరల్ వైద్య పరీక్షలతో పాటు, గైనిక్, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు కడియం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో శిబిరంలో పాల్గొన్నారు. జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు కూడా ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు సర్పంచ్ కొండపల్లి పట్టియ్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ ఎం.సుజాత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవలను వివరించారు. సర్పంచ్ పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాతపూడి బాబీ తదితరులు మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకునే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో ముందుగా ఇంటింటికీ వలంటీర్లు సర్వే చేశారన్నారు. ప్రజారోగ్యంపై సీఎం జగన్‌కు ఉన్న శ్రద్ధకు వైద్య శిబిరాలే తార్కాణమన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ చందన సేవాసంస్థ ఆధ్వర్యంలో శిబిరానికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు చర్యలు తీసుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.శిరీష పాల్గొన్నారు.



దుళ్లలో వైద్య శిబిరం వద్ద కళ్లజోళ్లు అందజేస్తున్న సర్పంచ్ పట్టియ్య, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు



దుళ్లలో రోగులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్

దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



మోటారు సైకిళ్ల పంపిణీ అనంతరం ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్, కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

- ఎంపీ భరత్ రామ్
- పది మందికి మూడు చక్రాల బైకులు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఎంపీ భరత్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల పెట్రోలు మోటారు బైకులను (స్కూటీలు), హెల్మెట్లను పది మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీని పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించేలా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. మరింత ఉజ్వల భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ చైర్మన్ కాటం రజనీ కాంత్, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, అజ్జరపు వాసు, పెంకే సురేష్, పార్టీ నాయకులు బళ్లా శ్రీనివాస్, రేగుళ్ల నాని పాల్గొన్నారు.

శాటిలైట్ సిటీ చర్చికి మైకుసెట్టు వితరణ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ ఇందిరమ్మ కాలనీలోని ఏసయ్య సహాయ మందిరం చర్చికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మైక్ సెట్టు వితరణ చేశారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం సంఘ కాపరి బండి ఏలియాకు అందజేశారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీ జనార్దనస్వామి కాలనీలో పర్యటన

ధవళేశ్వరం: గ్రామంలోని లక్ష్మీజనార్దనస్వామి కాలనీలో మంగళవారం చందన నాగేశ్వర్ పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అక్కడ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి కాలనీలో డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణానికి అంచనాలు తయారు చేసి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాలనీలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చందన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, ఎస్‌వీ శేఖర్, హమీద్ బాషా, కొత్తపల్లి శివ, అయినం చందు పాల్గొన్నారు.



ఏసయ్య సహాయ మందిరానికి మైకుసెట్టు అందజేస్తున్న చందన నాగేశ్వర్

సౌకర్యాలు లేవంటూ ఆందోళన

సీటీఆర్ఐ: జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు లేవంటూ దళిత, ప్రజా, విద్యార్థి సంఘాలు మంగళవారం సబ్ కలెక్టరేట్ ఆవరణలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ముట్టడి కార్యక్రమం నిర్వహించాయి. ఆ సంఘాల నాయకుడు బి.జార్జ్ ఆంథోనీ మాట్లాడుతూ హాస్టళ్లలో సౌకర్యాలపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు.

అన్నసమారాధన

ధవళేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా బ్యారేజీ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు స్వయంగా వడ్డించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పేరాబత్తుల బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, ఎస్‌వీ శేఖర్, హమీద్ బాషా, అయినం చందు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

గోకవరం: వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల వసతి గృహం విద్యార్థినులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వసతి గృహంలో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురి కావడంతో చికిత్స కోసం గోకవరం ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. ఈ క్రమంలో వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో పుకార్లు రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యాన సిబ్బంది ఆ వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఎటువంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని నిర్ధారించారు. నలుగురు విద్యార్థినులు సాధారణ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అనంతరం భోజనశాలను సందర్శించి, పరిశీలించారు. విద్యార్థినులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శంకర్, రమ్య, ఏఎన్‌ఎంలు సూర్యకాంతం, పవన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 5వ డివిజన్‌లో పర్యటన



సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలోనే సమీక్షించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 5వ డివిజన్ 9, 10 సచివాలయాల పరిధిలోని పలు వీధుల్లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కుక్కా తాతబ్బాయి ఆధ్వర్యంలో పర్యటించారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పలు సమస్యలను పరిష్కరించారు. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గుడాల జాన్సన్, గంటల వెంకన్న, గంతకూరి అప్పారావు, పోతుమూడి పెద బాబు, మందా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు



కలెక్టర్ మాధవీలతకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సీటీఆర్ఐ: విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు బొమ్మూరు చైతన్య స్కూల్లోనే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి స్కూల్ సమస్యలపై అర్జీ అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ మాధవీలత వారి నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు బొమ్మూరు స్కూల్లోనే తరగతులు నిర్వహించేలా యాజమాన్యానికి ఆదేశాల జారీ చేస్తామన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఆ స్కూలు మోరంపూడి బ్రాంచ్‌కు వెళ్లాలని సూచించారు. కాగా.. దాదాపు 32 రోజుల క్రితం బొమ్మూరులోని చైతన్య స్కూల్ మూతబడింది. న్యాయం చేయాలని తల్లిదండ్రులు వేడుకున్నా యాజమాన్యం పట్టించుకోలేదు. అనంతరం మోరంపూడి బ్రాంచ్‌లో బొమ్మూరు బ్రాంచ్ పిల్లలకు తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పడంతో తల్లిదండ్రులు మంగళవారం తమ పిల్లలను అక్కడకు తీసుకువెళ్లారు. అయితే అక్కడ విద్యార్థులకు సరిపడే సదుపాయం లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసి అర్జీ అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

- కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడపగడపకూ..



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలను నిరంతరం పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. రమా సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్, డివిజన్ ఇన్‌చార్జి దుంగ మంగ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక 40వ డివిజన్‌లోని టింబర్ మర్చంట్ నుంచి మూలగొయ్యి వరకూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ఇంటింటికీ పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని, ఇంటింటికి వెళ్లినప్పుడు వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు అర్జరపు వాసు, ఎలమంచిలి నాగరాజు, బత్తిన అన్నవరం, దమ్ము అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులజనగణన జరగాలి

సీటీఆర్ఐ: దేశంలో సమగ్ర కులజనగణన జరగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో మొదటిసారిగా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సమగ్ర కులజనగణన చేపట్టి రాష్ట్రంలో 63 శాతం బీసీలున్నారని ప్రకటించిన సందర్భంగా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాయుడు రాకేష్, డాక్టర్ అనసూరి పద్మలత పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

రాజానగరం: బాల్యం నుంచి యుక్త వయసులోకి అడుగుపెడుతున్న కిశోర బాలికలకు ఆరోగ్యరీత్యా ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ దివాన్ చెరువులోని డాక్టర్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దివాన్ చెరువులో మంగళవారం నిర్వహించిన సదస్సులో డాక్టర్ హేమమాళిని మాట్లాడుతూ ఆరోగ్యం – పరిశుభ్రతపై కిశోర బాలికలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. శరీరంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకుంటూ పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా బాలికల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మూత్రపిండాలకు అరుదైన శస్త్ర చికిత్స

కంబాలచెరువు: మూత్రపిండాల వాపునకు అరుదైన శస్త్రచికిత్సను విస్టార్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారని ఆ ఆసుపత్రి డైరెక్టర్, యూరాలజిస్ట్ డాక్టర్ వెంకట చైతన్య సింగంశెట్టి మంగళవారం తెలిపారు. హైడ్రోనెప్రోసిస్‌తో బాధపడుతున్న వ్యక్తికి నిర్వహించిన ఈ శస్త్ర చికిత్స చాలా క్లిష్టమైందన్నారు. మత్తు విషయంలోనూ పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆలస్యం అయితే కిడ్నీ ఫెయిలవుతుందని, ఈ వ్యాధి వల్ల మూత్రనాళాల్లో అడ్డువచ్చి మూత్రం పోవడం జరగదన్నారు. ఈ శస్త్రచికిత్సను పూర్తి విజయవంతంగా చేశామని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు



అదబాల రామకృష్ణను అభినందిస్తున్న బీజేపీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన పరిమి రాధాకృష్ణ, ఆడబాల రామకృష్ణారావు, నర్సిపల్లి హారిక బీజేపీ రాష్ట్ర వర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురికీ అభినందన కార్యక్రమం నిర్వహించామన్నారు. రాయుడు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి గీతా విజయలక్ష్మి, పైబొయిన సురేంద్ర, మలపాక కృష్ణమోహన్, సతీష్ పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

కంబాలచెరువు: స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో మర్రి బాబ్జీ అధ్యక్షతన మంగళవారం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగిందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులపై కొన్ని ప్రాంతాలలో జరుగుతున్న దాడులపై చర్చించడం జరిగిందన్నారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ టీవీ.శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొంకి రమేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.నరసింహమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.కరుణాకర్, స్టేట్ లీగల్ అడ్వైజర్‌గా డాక్టర్ ఎస్.రఘుపతిరావు, జి.రాజేష్ కుమార్‌ని నియమించారన్నారు.

పోసానిపై కేసు నమోదు అవాస్తవం

కంబాలచెరువు: సినీనటుడు, ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళిపై రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో తాజాగా కేసు నమోదు చేశారని వస్తున్న వార్తలు పూర్తి అవాస్తవమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై పోసాని కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గత ఏడాది నవంబర్ 19న వన్‌టౌన్‌లో కేసు నమోదైందన్నారు. అయితే తాజాగా వన్‌టౌన్‌లో ఆయనపై కేసు నమోదైందని వస్తున్న వార్తలు నిరాధారమైనవన్నారు. ఇటువంటి తప్పుడు వార్తలు ప్రచురించడం, ప్రచారం చేయడం, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.